## ప్రారంభమైన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

కడ్తాల్, మార్చి 12 : మండల పరిధిలోని చరికొండ గ్రామంలో వెలసిన రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఉదయం ఆలయంలో స్వామి వారికి అభిషేకం, అర్చనలు, హారతి, స్వస్తివాచకం, అంకురార్పణం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారిని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. స్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో భక్తుల సందడి



చేవెళ్లటౌన్, మార్చి 12 : మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం చేవెళ్లలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కొనగట్టు బ్రహ్మగిరి క్షేత్రంలో భక్తులు బారులు తీరారు. జిల్లా నలుమూలల నుంచి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఆమనగలు, మార్చి 12 : ఆమనగల్లు లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయురాలిగా బి. అంజలి, ఉపాధ్యాయులుగా ప్రవళిక, శీరిష, రాఖేశ్, అశ్విని, వైష్ణవి, ఇవాంజిత్ వ్యవహరించారు. బోధనలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాండు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## ఫిరంగినాలాను కబ్జా చేస్తే సహించేది లేదు



కాలువలో అక్రమంగా వేసిన రోడ్డును తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆదిబట్ల, మార్చి 12 : ఫిరంగినాలాతో పాటు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే సహించేది లేదని ఇబ్రహీంపట్నం ఆర్ఐ కృష్ణ అన్నారు. ఆదిబట్లలో ఫిరంగినాలాను కబ్జాచేసి అక్రమంగా వేసిన రోడ్డును మంగళవారం ఇరిగేషన్ ఈఈ శ్రీకాంత్‌తో కలిసి తొలగించారు. మళ్లీ ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి



డిప్యూటీ తహసీల్దార్ మధుకు వినతిపత్రం అందజేస్తున్న లింగారెడ్డిగూడ గ్రామస్తులు

షాబాద్, మార్చి 12: శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని లింగారెడ్డిగూడ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లింగారెడ్డిగూడ గ్రామంలో శ్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలని గతంలో కోరగా...సర్వే నంబర్ 456లో 1.20 ఎకరాల భూమిని చూపించారన్నారు. కానీ ఎవరైన చనిపోతే అక్కడికి మృతదేహాన్ని తీసుకెళ్తే ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులున్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కడ్తాల్, మార్చి 12 : కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన భవాని రాములు ఇటీవల మృతి చెందాడు. మంగళవారం ఉదయం ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు భాస్కర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఎంపీటీసీ వ్యక్తిగతంగా రూ.8 వేలు అందజేశారు. కార్యక్రమంలో యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ, మల్లేశ్‌గౌడ్, మల్లయ్య, భిక్షపతి, కుమార్, రాజేశ్, శ్రీకాంత్, భానుకిరణ్, ప్రవీణ్‌గౌడ్, చంద్రశేఖర్, మహేశ్, శ్రీను, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు : ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మార్చి 12 : పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఐక్య మత్యానికి , మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జామా మసీద్‌లో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదర భావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జగన్, నాయకులు మెకానిక్ బాబా, కృష్ణానాయక్, వస్పుల శ్రీశైలం, విజయ్, విజయ్‌రాథోడ్, అలీం, కలీం, హఫీజ్, సురేశ్ నాయక్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కడ్తాల్ : పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లింల ఉపవాస దీక్షలు మొదలయ్యాయి. మంగళవారం మండల కేంద్రంతోపాటు పరిధిలోని ఆయా గ్రామాల్లో రంజాన్ ప్రారంభం సందర్భంగా ఆయా మజీద్‌లలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పాత మజీద్‌లో ఇమామ్ మౌలానా జహీరుద్దీన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. నాయకులు పండ్లు తినిపించి ఉపవాసాలను విరమింపజేశారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, జావిద్, జహంగీర్‌బాబా, జహంగీర్‌అలీ, వాహబ్, ఇర్షాద్, ఇమ్రాన్, సులేమాన్, అహ్మద్, రబ్బానీ, యూనుస్, నదీమ్, నిజాం, మహబూబ్‌అలీ, నాయకులు రామచంద్రయ్య, వెంకటేశ్, భిక్షపతి, సత్యనారాయణ, మహేశ్, చెన్నయ్య, సురేశ్, యాదయ్య, రాజు పాల్గొన్నారు.

## నేడు 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అండ్ ఆల్టర్నేటివ్ మెటీరియల్స్'పై అవగాహన

జూబ్లీహిల్స్, మార్చి 12: ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలపై అవగాహన కల్పించేందుకు నిమ్స్‌మే, పీసీబీ సంయుక్తంగా కార్యాచరణ చేపడుతున్నారు. ఈ మేరకు యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మేలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అండ్ ఆల్టర్నేటివ్ మెటీరియల్స్' అన్న అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వర్క్ షాప్ డైరెక్టర్ జె.కోటేశ్వర రావు తెలిపారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మే క్యాంపస్‌లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30 వరకు సదస్సు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు https://www.nimsme.org /surl/laos లింక్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నం. 81062 56066/ 81255 44429/ 040-23633241 లలో సంప్రదించాలన్నారు.

## ప్రా. ఏవీ రాజశేఖర్‌కు అరుదైన అవకాశం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 12: ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అరుదైన ఘనతను దక్కించుకున్నారు. కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు శాఖ ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ లెవల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ సభ్యుడిగా ప్రొఫెసర్ రాజశేఖర్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం రాజపత్రం విడుదల చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. జగిత్యాలకు చెందిన పద్మశాలి కుటుంబంలో జన్మించిన రాజశేఖర్ ఓయూలోనే చదువుకుని అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన ఆయన శాతవాహన యూనివర్సిటీ జువాలజీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్, ఓయూ అకాడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్, నిజాం కళాశాల జువాలజీ విభాగం హెడ్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

# ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే చర్యలు



మున్సిపాలిటీ రెవెన్యూ సర్వే నం.631ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్ దత్తు

తుర్కయాంజాల్, మార్చి 12: మున్సిపాలిటీ పరిధిలోని మాసాబ్‌చెరువును మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సర్వే చేశారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ డీఈ ఉషారాణి మా ట్లాడుతూ మాసాబ్‌చెరువును పూర్తిస్థాయిలో సర్వే చేసి ఎఫ్‌టీఎల్ దిమ్మెలు లేని చోట వాటిని ఏర్పాటు చేయడంతోపాటు బఫర్ జోన్ పాయింట్‌ను గుర్తిస్తున్న ట్లు చెప్పారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినా.. అక్రమ నిర్మాణాలు వెలిసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తుర్కయాంజాల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, ఆర్ఐ భిక్షపతి, సర్వేయర్ జ్యోతి, ఇరిగేషన్ ఏఈ రాజా పాల్గొన్నారు.

**ప్రభుత్వ స్థలానికి హద్దులు ఏర్పాటు చేస్తాం..**

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 631లోని ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు అన్నారు. మంగళవారం ఆయన సర్వేనంబర్ 631లోని భూమిని ఆర్ఐ భిక్షపతితో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈ భూమిలో కొంత కబ్జాకు గురికావడం తో సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేస్తామన్నారు.

## భవనం పై నుంచి పడి వ్యక్తి మృతి

- సెంట్రింగ్ చెక్క కొడుతుండగా ప్రమాదం

మొయినాబాద్, మార్చి12 : భవనం పై నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ పీఎస్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని చిన్న మంగళారం గ్రామానికి చెందిన బిజిలి ఎల్లేశ్ అనే వ్యక్తి గ్రామంలో నూతనంగా భవనాన్ని నిర్మిస్తుండగా.. అతడి వద్ద ఆ గ్రామానికే చెందిన మల్లేశ్ అనే వ్యక్తి కూలీగా పని చేస్తున్నాడు. మూడంతస్తుల భవనంలో అతడు రెండో అంతస్తులో సజ్జలకు సెంట్రింగ్ చెక్క కొడుతుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సజ్జలకు సెంట్రింగ్ చెక్క కొట్టేటప్పుడు గోవా కట్టెలు కట్టడంలో ఇంటియజమాని చేసిన నిర్లక్ష్యంతోనే ఓ వ్యక్తి చెందాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటి యజమానిపై చర్యలు తీసుకుని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

# రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి



మంచాల రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న రైతులు

మంచాల, మార్చి 12 : అధిక ఉష్ణోగ్రత ప్రభావం వల్ల వివిధ పంటల్లో జరిగే నష్టాలకు రైతులు గుర్తించి వాటికి నివారణ చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటించాలని ఇబ్రహీంపట్నం ఏడీఏ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి జ్యోతిశ్రీ అన్నారు. మంగళవారం మంచాల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి కాలంలో మామిడిలో చాలా వరకు పిండరాలడం వంటివి జరుగుతాయని వివరించారు. అదేవిధంగా అధిక ఉష్ణోగ్రత వల్ల వివిధ రకాల పంటలకు తెగుల్లు సోకే ప్రమాదం ఉందని, వాటి నివారణకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మందులను పిచికారీ చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో రైతులకు కలిగే లాభాలపై శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు సాయిశ్రీ, సరిత, లింగస్వామి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రాయికల్ హెచ్‌ఎంకు మహిళా శక్తి అవార్డు



ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌రూరల్, మార్చి 12 : ఫరూఖ్‌నగర్ మండలంలోని రాయికల్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం జయ్యమ్మకు మహిళా శక్తి అవార్డు వరించింది. మంగళవారం పాఠశాల ఆవరణలో ఆమె ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి చేసిన సేవల వల్లే అవార్డు వచ్చిందన్నారు. తెహల్ కా న్యూస్ గాంధీ గ్లోబల్ వారు మహిళా దినోత్సవం నాడు సేవలను గుర్తించి అవార్డు అందజేశారని తెలిపారు. అదేవిధంగా భారతి ఫౌండేషన్ ఇబ్రహీంపట్నం ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా, చిత్రలేఖనం పోటీల్లో పాఠశాలకు చెందిన దినేశ్, రాఖేశ్ లోకేశ్, గౌతమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తాగు నీటి సమస్యలు రాకుండా చర్యలు



గ్రామంలో పర్యటిస్తున్న మిషన్ భగీరథ డీఈ

ఆదిబట్ల, మార్చి 12 : మున్సిపల్ పరిధిలో తాగు నీటి సమస్యలు రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటామని మిషన్‌భగీరథ డీఈ ప్రియాంకారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లి, సాహెబ్‌గూడ గ్రామస్తులు ఎమ్మెల్యే రంగారెడ్డికి నీటి సమస్యపై వివరించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆయా గ్రామాల్లో అధికారులు పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



షాబాద్ : గాలికుంటు నివారణ టీకా వేస్తున్న డాక్టర్ స్రవంతి తదితరులు

షాబాద్, మార్చి 12: రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. మంగళవారం మండలంలోని కేసారం, దైవాలగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు టీకాలు, వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బలరాం, కృష్ణ, బాలరాజు, శ్రీకాంత్, రాణి ఉన్నారు.

**టీకాలు వేయించాలి**

మంచాల : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పకుండా వేయించాలని పశువైద్యాధికారి డాక్టర్ సుధా అన్నారు. మంగళవారం మంచాలలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాంచందర్, శ్రీశైలం, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మంచాలలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ సుధ

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కొత్తూరు, మార్చి 12: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నేషనల్ హైవే 44పై నాట్కో చౌరస్తా వద్ద మంగళవారం ఉదయం జరిగింది. సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. శంషాబాద్ రాళ్లగూడకు చెందిన భిక్షపతి (67) ఉదయం 5 గంటల సమయంలో నాట్కో చౌరస్తా వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో భిక్షపతికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# మారండి..మంచిగా బతకండి

- ఇబ్రహీంపట్నం ఏసీపీ పీకేవీ రాజు
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ఇబ్రహీంపట్నం, మార్చి12: గతాన్ని మర్చి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ పీకేవీ రాజు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో ఎలాంటి ఘటనలకు పాల్పడొద్దన్నారు. అల్లర్లు, గొడవలకు పాల్పడితే సహించేదిలేదన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడూ నిఘా ఉంటుందన్నారు. గ్రామాల్లో రౌడీషీటర్లుగా గుర్తించిన వారిపై నిఘా ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగిస్తే రౌడీషీట్ పీడీ కేసులను నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు. నిబంధలను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ రాజు